జాతీయ పజిల్ దినోత్సవం

విశాలాంధ్ర - తగరపువలస: జాతీయ పజిల్ డే ప్రతి సంవత్సరం జనవరి 29న జరుపుకుంటారని పజిల్స్ పరిష్కరించడం వల్ల మెదడు, మనస్సు, సామాజిక నైపుణ్యాలు మెరుగుపడతాయని స్థానిక ఒకటవ వార్డు జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల బంగ్లామెట్ట ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు అన్నారు. పజిల్స్‌తో మెదడుకు పదును పెట్టడం ద్వారా జ్ఞాపకశక్తి పెరుగుతుందని, వివిధ నైపుణ్యాలు పెంపొందుతాయని విద్యార్థులకు తెలియజేశారు. పజిల్ వలన కలిగే లాభాలను వివరించి విద్యార్థులచే పజిల్స్ చేయించారు. పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరహరిశెట్టి రమేష్, ఈగల సంజీవి, బుగత మల్లిక ఛాత్రోపాధ్యాయులు రాహేలు, కృష్ణవేణి, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై మురుగునీరు

- వాహన చోదకుల ఇబ్బందులు
- గత వారం రోజులుగా పరిష్కారం కాని సమస్య
- నిద్రపోతున్న అధికారి యంత్రాంగం

విశాలాంధ్ర - ఆనందపురం: గత వారం రోజులుగా నేషనల్ హైవేపై మురుగునీరు చెరువును తలపించేలా వాహనదారులను, ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తుంది. బుధవారం ఉదయం కూడా 6 గంటల ప్రాంతంలో ఆనందపురం మండలంలోని వెల్లంకి గ్రామపంచాయతీ పరిధిలో నారాయణ జూనియర్ కళాశాల సమీపంలో జాతీయ రహదారి పైకి మురుగు నీరు ఏరులై పారింది. దీంతో ఆ రహదారిలో ప్రయాణించే వాహన చోదకులు తీవ్రమైన ఇబ్బందులకు గురయ్యారు. సేవా రహదారికి ఆనుకొని ఉన్న మురుగు కాలువలో చెత్త పేరుకుపోవడం వలన, దానిని ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోవడం వలన మురుగునీరు ప్రవాహానికి ఆటంకం ఏర్పడి ఆ నీరు రహదారిపై పేరుకుపోయింది. దీంతో ఉదయాన్నే అటువైపు వెళుతున్న వాహన చోదకులు ఇబ్బందులకు గురయ్యారు. వెల్లంకి గ్రామ పంచాయతీ అధికారులు, జాతీయ రహదారి భద్రత అధికారులు తక్షణమే ఈ సమస్యపై స్పందించి చర్యలు చేపట్టాల్సిందిగా స్థానిక ప్రజలు కోరుతున్నారు.

సిఎం దృష్టికి దక్షిణ నియోజకవర్గం సమస్యలు

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: జనసేన పార్టీ విశాఖ అధ్యక్షులు, దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ విజయవాడలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుని కలిశారు. ఈ సందర్భంగా దక్షిణ నియోజకవర్గంకు సంబంధించిన పలు సమస్యలను సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లారు. ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు ఆయా అంశాలపై సానుకూలంగా స్పందించి త్వరలో పరిష్కరిస్తారని హామీ ఇచ్చారు.

ఉద్యోగ అవకాశాలపై గీతంలో సదస్సు

విశాలాంధ్ర - మధురవాడ: ప్రస్తుత పోటీ ప్రపంచంలో పారిశ్రామిక రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా యువతరం ఎలాంటి నైపుణ్యాలను పెంచుకోవాలో తెలియజేస్తూ ప్రముఖ కార్పోరేట్ సంస్థలలోని మానవ వనరుల విభాగాల అధిపతులతో (చీఫ్ హ్యూమన్ రీసోర్స్ ఆఫీసర్స్) గీతం డీమ్డ్ విశ్వ విద్యాలయం స్కూల్ ఆఫ్ బిజినెస్ బుధవారం ప్రత్యేక సదస్సును నిర్వహించింది. సదస్సును జిఎమ్ఆర్ ఇన్‌ఫ్రాలిమిటెడ్, ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రాయం డైరెక్టర్ డాక్టర్ ఈ.శంకరరావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా కార్పొరేట్ రంగంలో వస్తున్న మార్పులకు తగ్గ నైపుణ్యాలను యువత పెంచుకోవాలని సూచించారు. కృత్రిమ మేధ కారణంగా లక్షల సంఖ్యలో ఉద్యోగాలు కోల్పోతున్నప్పటికీ అదే సంఖ్యలో కొత్త తరం ఉద్యోగాలు అందుబాటులోకి వస్తున్నాయని తెలిపారు. యువతరం డిజిటల్ అక్షరాస్యత, నిరంతర విజ్ఞాన సముపార్జన, లోతైన విషయ పరిజ్ఞానం, విశ్లేషనాత్మక దృష్టిని పెంచుకోవాలని సూచించారు. గీతం ఇన్‌ఛార్జి వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ వై.గౌతమ్ రావు మాట్లాడుతూ పరిశ్రమల అవసరాలకు తగిన విధంగా గీతంలో మానవ వనురులకు శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. గీతం ఛీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ ఎన్.క్రిష్ మాట్లాడుతూ ఆత్మ విశ్వాసం, నిజాయితి, ఎవరితోనైనా పోటీ పడే సమర్ధత అలవరుచుకోవాలన్నారు. గీతంలో విద్యార్థులను మెంటార్‌లుగా వ్యవహరించే నూతన పద్దతిని ప్రారంభించామని తగు శిక్షణ ద్వారా 14 వందల మంది సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులకు మెంటార్‌లుగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎడూన్ సంస్థ వ్యవస్థాపకుడు అనిల్ కుమార్, గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజాఫణిపప్పు, జెమ్ కన్వీనర్ డాక్టర్ బి.కృష్ణకుమారి, జెమ్-25 ఛీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎస్.ఎస్.మిశ్ర, జెమ్‌కో సిఇఓ కె.చెర్రి హేడ్‌స, గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ ఇన్‌ఛార్జి డైరెక్టర్ డాక్టర్ కె.లుబ్జ నిహార్, సదస్సు కన్వీనర్ డాక్టర్ టి.సౌదామిని తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీవో వ్యవహార శైలిపై కలెక్టర్‌కు ఫిర్యాదు

విశాలాంధ్ర - పెందుర్తి: ఆర్డీవో శ్రీలేఖ వ్యవహార శైలిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు నగరంలోని మురళి నగర్‌కు చెందిన డి.వి.మహేష్ తెలియజేశారు. బుధవారం పెందుర్తిలో ఆయన మాట్లాడుతూ ఈనెల 27న పెందుర్తి తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారం కార్యక్రమంలో పాల్గొన్న ఆర్డీవోను కలిసి చాలాకాలంగా అపరిష్కృతంగా ఉన్న సర్వేనెంబర్ 164/1లో భూ సమస్యను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం ఇచ్చామని, అయితే తన విజ్ఞప్తిని పట్టించుకోకుండా ఆర్డీవో శ్రీలేఖ దురుసుగా తనను దూషించారని వెల్లడించారు. పలుమార్లు పరుష పదజాలంతో తన హక్కులకు భంగం కలిగించేలా వ్యవహరించారని మహేష్ తెలిపారు. పై భూమికి సంబంధించి హైకోర్టులో తాను పిటీషన్ దాఖలు చేశానని దాన్ని వివరించేందుకు ప్రయత్నించినా, ఆర్డీఓ పట్టించుకోలేదని వాపోయారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి ఆర్డివోపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను కోరినట్లు మహేష్ మీడియాకు వెల్లడించారు.

వీనుల విందుగా సింహాద్రి నాధుని నౌకా విహారం

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి వారి తెప్పోత్సవం (నౌకావిహారం) వీనుల విందుగా జరిగింది. వేదపండితుల మంత్రోచ్ఛారణాల నడుమ పెరుమాళ్ళు వేణుగోపాలస్వామి అవతారంలో ఉభయ దేవేరులైన భూదేవి, శ్రీదేవిలతో మెట్లమార్గం మీదుగా సింహాచలం గ్రామంలో తొలిపావంచా వద్దకు ప్రధాన పురోహితులు, ప్రధాన అర్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు వారి బృందం స్వామిని అందంగా

అలంకరించిన పల్లకిలో తీసుకొచ్చారు. అనంతరం మృదు మధుర నాదస్వర వాయిద్యాల నడుమ స్వామివారిని వరాహ పుష్కరిణిలో హంస వాహనంపై వేంచేయింపజేశారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి వి.త్రినాధరావు ఆదేశాల మేరకు అధికారులు స్వామి వారి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి నౌకావిహారం సందర్భంగా సిపి ఆదేశాల మేరకు ఏసీపీ అన్నెపు నరసింహ మూర్తి పర్యవేక్షణలో గోపాలపట్నం సిఐ భక్తులకు ఎటువంటి అవాంచనీయ సంఘటనలు కలగకుండా ప్రత్యేక బందోబస్తును ఏర్పాటు చేశారు.

శాటిలైట్ ప్రయోగాన్ని వీక్షిస్తున్న విద్యార్థులు

విశాలాంధ్ర - పెదగంట్యాడ: ఇస్రో శాస్త్రవేత్తలు ప్రయోగించిన 100వ శాటిలైట్ ప్రయోగాన్ని వీక్షించేందుకు వీలుగా ట్వింకిల్ విద్యా నికేతన్ ప్రిన్సిపల్ బి.శాంతి ఏర్పాట్లు చేశారు. ట్వింకిల్ విద్యానికేతన్ విద్యార్థులు ఎంత ఉత్సాహంతో వీక్షించారు. ఈ శాటిలైట్ ప్రయోగం నుండి కక్షలోకి చేరేంతవరకు విద్యార్థులు వీక్షించారు. ఈ శాటిలైట్ పూర్తిగా స్వదేశీయ విజ్ఞానంతో బెంగళూరులో తయారు చేశారని విశదీకరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులతో పాటు టీచర్లు లక్ష్మి, రామలక్ష్మి, భాను, నీలవేణి, ఉష, లిల్లీ, కల్పనా పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - ఆనందపురం: మండలంలోని వెల్లంకి గ్రామంలో ఉచిత పశు ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరానికి పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎమ్.చంద్ర శేఖర్, చినగదిలి అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ సజ్జ శ్రీనివాసరావు హాజరయ్యారు. డిప్యూటీ డైరెక్టర్ మాట్లాడుతూ బహువార్షిక పశుగ్రాసాల పెంపకం గురించి వివరించారు. అదే విధంగా దూడ పెయ్యలతోపాటు పెద్ద పశువులు అన్నింటికి నట్టలు నివారణ మందులు వేయాలని, పశువులన్నింటికి సకాలంలో టీకాలు వేసుకోవాలని తద్వారా జబ్బులు నుండి కాపాడుకోవాలని చెప్పారు. కోళ్లకి కొక్కెర తెగుళ్ల టీకాలు వేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వెల్లంకి సర్పంచ్ ఉప్పాడ లక్ష్మణరావు, ఉపసర్పంచ్ కంచరాపు శ్రీనివాసరావు, పిన్నింటి వెంకటరమణ, గొలగాని బాలు, నాయకులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో 26 పశువులని తనిఖీ చేసి 46 లేగ దూడలకి నట్టల నివారణ మందులు తాగించారు. ఈ కార్యక్రమంలో డా. పి. అనిల్ కుమార్, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీలో సమస్యలను పరిష్కరించండి

ఎంపీడీవోకు జనసేన నేతల వినతి

విశాలాంధ్ర - ఆనందపురం: లోడగలవానిపాలెం పంచాయతీకి అభివృద్ధి పూర్తిస్థాయిలో జరగలేదని జనసేన నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీలో ఎక్కడ కూడా పూర్తిస్థాయిలో గత ప్రభుత్వంలో పనులు జరగలేదని ఇప్పుడు కూటమి ప్రభుత్వ హయాంలో అయినా పూర్తిస్థాయిలో పంచాయతీని అభివృద్ధి చేయాలని ఆనందపురం మండలం ఎంపీడీవో జానకిని బుధవారం లోడగలవానిపాలెం జనసేన నాయకులు కలిసి వినతిపత్రం సమర్పించారు. అందులో భాగంగా గత ప్రభుత్వంలో నిర్మించిన వైయస్సార్ రైతు భరోసా కేంద్రం అభివృద్ధి జరగక నిరుపయోగంగా ఉందని, అలాగే హెల్త్ క్లినిక్ సెంటర్, సెంట్రల్ గవర్నమెంట్ ఫండ్‌తో నిర్మించిన మంచినీరు ట్యాంక్ నిర్మాణం సగంలో ఆగి పోయినందున పూర్తిస్థాయిలో పని పూర్తి చేయాలని, నేలతేరు గ్రామంలో గత 20 సంవత్సరాల నుంచి రోడ్లు, డ్రైనేజీ లేక గ్రామ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అలాగే గ్రామంలో సిసి రోడ్లు, డ్రైనేజీ పనులు వెంటనే పూర్తి చేయాలని ఎస్సీ కాలనీలో నీటి సమస్య పెండింగ్‌లో ఉందని సత్వరమే పనిచేసే ఇంటింటికి మంచినీళ్ల కొళాయిలు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో లోడగల వానిపాలెం జనసేన నాయకులు కొయ్య నాని, లోడగల సురేష్ కుమార్, ఆల్తిరాజు, గోలగాని సాయి, వెంకటేష్, తోటరాజు, బాల, తదితర నాయకులు పాల్గొన్నారు.

30 నుంచి రాష్ట్ర స్థాయి ఆర్థోపెడిక్ సదస్సు

కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ఈనెల 30 నుంచి ఫిబ్రవరి 2 వరకూ వుడా చిల్డ్రన్స్ ఎరీనాలో స్టేట్ ఆఫ్ ఆర్థోపెడిక్ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద తెలిపారు. బుధవారం కేజీహెచ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎక్సలెన్స్ ఎక్రాస్ ఆల్ డైమెన్షన్స్ ఆఫ్ ఆర్థోపెడిక్స్ అనే అంశంపై వర్క్ షాప్ జరుగుతుందన్నారు. ఈ సద స్సులో వెయ్యి మంది ఆర్థోపెడిక్ వైద్యులు పాల్గొంటున్నారని తెలిపారు. ఒకటో తేదీన రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ముఖ్య అతిధిగా పాల్గొంటారని చెప్పారు. జాతీయ అంతర్జాతీయ ఆర్థోపెడిక్ ఫ్యాకల్టీ భాగస్వామ్యులవుతున్నారన్నారు. 400 మంది పేపర్ ప్రజెంటేషన్ చేస్తారని, ప్రీ కాన్ఫరెన్స్ వర్క్ షాపు 30వ తేదీన జరుగు తుందన్నారు. లైఫ్ టైమ్ అఛీవ్‌మెంట్ పురస్కారాన్ని డాక్టర్ అంబేద్కర్‌కు అందిస్తామని చెప్పారు. పోలీట్రామ్ అండ్ ఓపెన్ ఇంజరీ మేనేజ్మెంట్ అనే థీమ్‌తో గంగా ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ రాజశేఖర్ నేతృత్వంలో ఆరుగురు సభ్యుల బృందం లైవ్ ప్రజెంటేషన్ ఇస్తారని తెలిపారు.

పరస్పర సహకారంతో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: విద్యా సంస్థలు, నైపుణ్య శిక్షణ సంస్థలు, పరిశ్రమల నిర్వాహకుల పరస్పర సహకారం, ప్రణాళికతో స్థానిక యువతకు పెద్ద యెత్తున ఉపాధి అవకాశాలను సృష్టించవచ్చని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. ఇంటరాక్షన్ ఆన్ స్కిల్ డెవలప్మెంట్ అండ్ జాబ్ క్రియేషన్ ఇన్ విశాఖ రీజియన్ అనే పేరుతో కలెక్టరేట్ మీటింగు హాలులో బుధవారం సాయంత్రం నిర్వహించిన ప్రత్యేక పరిచయ సదస్సులో జిల్లా కలెక్టర్ పలు అంశాలపై మాట్లాడారు. విశాఖ జిల్లా యువతకు ఉపాధి అవకాశాలను మెండుగా కల్పించాల్సి ఉందని, దానికి తగిన కార్యాచరణతో ప్రతి ఒక్కరూ పని చేయాలని సూచించారు. విద్యా సంస్థలు, పరిశ్రమలు నెలకొకసారి ప్రత్యేకంగా సమావేశం కావాలని, అవసరాలను గుర్తించి దానికి తగిన అభ్యర్థులను తయారు చేసుకోవాలని చెప్పారు. ఆయా కంపెనీల్లో అవసరాల మేరకు శిక్షణ అందించాలని చెప్పారు. ముందుగానే విద్యా, నైపుణ్య శిక్షణ సంస్థలతో ఒప్పందాలు చేసుకొని తగిన కోర్సులు ప్రవేశ పెట్టేలా సంప్రదింపులు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో భాగంగా వివిధ కంపెనీల ప్రతినిధులు మాట్లాడుతూ సంబంధిత కంపెనీల్లో ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, అయితే దానికి తగిన నైపుణ్యం కలిగిన వ్యక్తులను అందించాలని విజ్ఞప్తి చేశారు. కొన్ని అంశాల్లో నైపుణ్యం కలిగిన యువత స్థానికంగా లభ్యం కావటం లేదని, కంపెనీల అవసరాలకు సరిపడిన ఇంజనీర్లను తయారు చేసే కోర్సులు స్థానికంగా లేవని పలువురు సమావేశంలో ప్రస్తావించారు. సమావేశంలో సీఐఐ ప్రతినిధులు మురళీ కృష్ణ, నీరజ్ సర్దా, గ్రంధి రాజేశ్, పీఎస్ ఠాగూర్, ఉపాధి కల్పనా అధికారి సుబ్బిరెడ్డి, స్కిల్ డెవలప్మెంట్ అధికారి, ఇతర విభాగాల అధికారులు, పలు ఐటీ, ఫార్మా, చిన్న, మధ్య తరహా పరిశ్రమల నిర్వాహకులు, ఏయూ, ఐఐఎం, పాలిటెక్నిక్, ఐటీఐ విద్యా సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సోమనాదేశ్వర రథయాత్ర ప్రారంభం

విశాలాంధ్ర - గాజువాక: సోమనాదేశ్వర వజ్ర లింగ రథ యాత్రను 72వ వార్డు కార్పొరేటర్ ఏ.జె.స్టాలిన్ బుధవారం ఉదయం ప్రారంభించారు. బ్రహ్మ కుమారి ఈశ్వరీయ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో ఉడా కాలనీ శాఖ పర్యవేక్షణలో బుధ వారం అంగ రంగ వైభవంగా సోమనాదుని రథయాత్ర ప్రారంభమైంది. కార్పొరేటర్ స్టాలిన్ తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి అనంతరం ఈశ్వరీయ పతాకాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో ప్రస్తుతం నైతిక విలువలు పడి పోయి దుఃఖ అశాంతిలు నెలకొన్నాయని అన్నారు. ప్రజలకు నైతిక విలువలను పెంపొందించేందుకు బ్రాహ్మకుమారీలు చేస్తున్న సేవలు అమోఘమని అన్నారు. ఈ కార్యక్రమంలో డా. హేమలత, న్యాయవాది అండిబోయిన లక్ష్మి, డా.పంకజ్, రథ నిర్వాహకులు సుభాష్, గాజువాక ఇన్చార్జి బి.కె.మణి, ఉడా కాలనీ ఇన్చార్జి బి.కె.శాంతి, శ్రీనివాసరావు, నందికి తాతారావు, సిపిఐ నాయకులు అప్పా రీ విష్ణు మూర్తి, జి.ఆనంద్ పాల్గొన్నారు.

పద్మనాభ నగర్ పాఠశాలకు కంచాలు, కుర్చీలు వితరణ

విశాలాంధ్ర - గోపాలపట్నం: గ్రేటర్ విశాఖ 92వ వార్డు పద్మనాభ నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు రాష్ట్ర యువశక్తి అవార్డు గ్రహీత నందవరపు సోములు 50 కంచాలు, పాఠశాలకు కుర్చీలు అందజేశారు. ఈ సందర్భంగా నందవరపు సోములు మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ప్రతిఒక్కరు కృషి చేయాలని ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలలో ఎక్కువగా పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఉంటారని వారికి అవసరమగు పుస్తకాలు, ఇతర సామాగ్రి కూడా అందించుటలో అలాగే పాఠశాలకు కనీస సౌకర్యాలు కల్పించుటలో అవసరమగు సామాగ్రిని కూడా సమకూర్చేందుకు స్థానిక స్వచ్ఛంద సంఘాలు ముందుకు రావాలని అన్నారు. అనంతరం పాఠశాలకు కుర్చీలు, కంచాలు వితరణ చేసిన బలివాడ రామకుమారి, బలివాడ ప్రసన్నలకు ఈ సందర్భంగా సోములు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం ఉమారాణి, జనతా మహిళా సేవా సంఘం అధ్యక్షురాలు ఎం.విమల, సభ్యులు దాసరి శివలక్ష్మి మజ్జి జమున, బేగం, ఉపాధ్యాయులు శోభారాణి, పేరి నాయుడు, అమర పిన్ని అరుణ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి ముఠా పట్టివేత

విశాలాంధ్ర - పద్మనాభం: మండలంలోని పాండ్రంగి పంచాయతీ కురపల్లి గ్రామంలో గంజాయి వ్యాపారం జరుగుతున్నట్లు అందిన సమాచారం మేరకు పోలీసులు తనిఖీ చేయగా ఓ మామిడి తోటలో గంజాయి ముఠా పట్టుబడినట్లు సీఐ శ్రీధర్ తెలిపారు. నిమ్మకాయల సాయి ప్రసాద్, తమటా ప్రేమ్ గోపాల్, పలికి బోసు అనే ముగ్గురు నిందితుల దగ్గర సుమారు 1.5 కేజీల గంజాయి, రెండు సెల్‌ఫోన్లను సీజ్ చేసినట్లు తెలియజేశారు. కేసు నమోదు చేసి వారిని రిమాండ్‌కు తరలించినట్లు తెలియజేశారు.

నేడు మాంసం దుకాణాలకు సెలవు

- జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డా. నరేష్ కుమార్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: జనవరి 30 గురువారం మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ పరిధిలో గల జంతు వధ, మాంస విక్రయముల నిషేధం ఉన్నందున జంతువధశాలలు, మటన్, చికెన్, చేపలు, మొదలైన మాంసాహారపు దుకాణాలకు సెలవు ప్రకటించినట్టు హెూటళ్ళు, రెస్టారెంట్లలో ఎటువంటి మాంసాహారాలను వినియోగించ రాదని జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డా. ఇ.ఎన్.వి.నరేష్ కుమార్ బుధవారం తెలిపారు. జిల్లా కలెక్టర్ జీవీఎంసీ ఇన్‌చార్జ్ కమిషనర్ డాక్టర్ ఎమ్.ఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశాల మేరకు జనవరి 30వ తేదీన గురువారం మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా జివిఎంసి పరిధిలో మటన్, చికెన్, చేపలు మొదలైన మాంసాహార అమ్మకాలు నిషేధించి నందున శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ కార్యదర్శులు, శానిటరీ మేస్త్రీలు వారి సచివాలయం పరిధిలో గల మాంసం, చేపలు విక్రయశాలలను మూసి వేయవలసినదిగా ఆదేశించామని తెలిపారు. కావున బహిరంగంగా మాంసం విక్రయదారులు మాంసాన్ని విక్రయించరాదని అందుకు విరుద్ధంగా అతిక్రమంచి దుకాణాలు తెరిచినా, మాంసాన్ని అమ్మిన యెడల చట్టపరమైన చర్యలు తీసుకోవడం తో పాటు అపరాధ రుసుము వసూలు చేయడం జరుగుతుందని ప్రధాన వైద్యాధికారి హెచ్చరించారు.

రక్తదానం చేసిన అనిట్స్ వైద్య విద్యార్థులు

విశాలాంధ్ర - తగరపువలస: స్థానిక ఎన్ఆర్ఐ వైద్య విద్యా సంస్థ విద్యార్థులు వినూత్నంగా వారి దేశ భక్తిని చాటి చెప్పారు. గణతంత్రం వచ్చి 75 సం.లు నిండిన సందర్భంగా 75 మంది వైద్య విద్యార్థులు రక్తదానం చేసి దేశం పట్ల వారికున్న భక్తి భావాన్ని ప్రకటించారు. ఇందులో 50 మంది విద్యార్థులు మొదటిసారి రక్తదానం చేశారు. విద్యార్థుల అంకిత భావాన్ని కళాశాల డీన్ డా. పి.వి.సుధాకర్ అభినందించారు. విద్యార్థుల్లో ఈ స్ఫూర్తిని నింపినందుకు బ్లడ్ సెంటర్ ఇన్‌చార్జి డా. ఎం.ఎస్.శర్మను అనాటమీ ప్రొఫెసర్ డా. జి.వి.శివ ప్రసాద్, డా. సామాజిక శాస్త్ర విభాగపు అసోసియేట్ ప్రొఫెసర్ డా. జి.శ్రీనివాస్, సూక్ష్మ జీవ శాస్త్ర విభాగపు ప్రొఫెసర్ డా. కే.వీ.చక్రధర్‌లను అభినందించారు. ఈ కార్యక్రమంలో అనిల్ నీరుకొండ హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ కే.సి.రెడ్డి పాల్గొన్నారు.

ప్రహ్లాదపురంలో సంవిధాన గౌరవ్ దివస్ అభియాన్

విశాలాంధ్ర - పెందుర్తి: భారతీయ జనతా పార్టీ వేపగుంట కమిటీ అధ్యక్షుడు రట్టి జయరాజు ఆధ్వర్యంలో జీవీఎంసీ 93వ వార్డు ప్రహ్లాదపురం బస్తీలో సంవిధాన గౌరవ్ దివస్ అభియాన్ కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. బీజేపీ పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గం కన్వీనర్ గొర్లె రాము నాయుడు ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని భారత రాజ్యాంగం విధి విధానాలు గొప్పతనం గురించి వివరించారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ద్వారా దేశ ప్రజలకు లభించిన హక్కులు, దేశ సార్వభౌమత్వం, తదితర అంశాలను వెల్లడించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ గొట్టివాడ సామ్రాట్, వార్డ్ బిజెపి అధ్యక్షులు పురుషోత్తం, ముఖ్య కార్యకర్తలు సంఘ్ పెద్దలు పాల్గొన్నారు,

ఘనంగా శ్రీ అభయాంజనేయ స్వామి
18వ వార్షికోత్సవ వేడుకలు
స్వామి వారిని దర్శించుకున్న పలువురు నేతలు

విశాలాంధ్ర - ఆనందపురం: మండలంలో లోడగలవానిపాలెం పంచాయతీ శ్రీ అభయాంజనేయ స్వామి 18 వార్షికోత్సవ ఉత్సవాలు ఆలయ ధర్మకర్త బమ్మిడి ఉమా సూర్యనారాయణ, ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే పూజలు, కోలాటం, తప్పెడగుళ్ళు, అంగరంగ వైభవంగా నిర్వహించారు. సుమారు 4 వేల మంది భక్తులు అన్న ప్రసాదాలు స్వీకరించారని ఆలయ ధర్మకర్త తెలిపారు. కార్యక్రమంలో బమ్మిడి తారక్, భీమిలి జనసేన పార్టీ ఇన్చార్జ్ సందీప్ పంచకర్ల, శ్రీను బాబు ,కృష్ణయ్య, మండల పార్టీ ప్రెసిడెంట్ తమ్మిన అప్పలరాజు, ప్రధాన కార్యదర్శి కోరుకొండ మూర్తి, ఉపాధ్యక్షులు బాలు, దివాకర్, స్థానిక నాయకులు, కోయ్యి నాని, లోడగల సురేష్ కుమార్, ఆల్తి రాజు, లెంక శంకర్, అప్పలరాజు, ఉత్సవ కమిటీ, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

11 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు

విశాలాంధ్ర - పెందుర్తి: మద్యం మత్తులో వాహనాలు నడిపిన 11 మందిపై కేసులు నమోదు చేసినట్లు పెందుర్తి ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాసరాజు తెలిపారు. వారిని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి ఒక్కొక్కరికి పదివేల చొప్పున అపరాధ రుసుము విధించినట్లు వెల్లడించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే శిక్ష తప్పదని, వాహనదారులు నిబంధనలు తప్పక పాటించాలని ఆయన సూచించారు.

ఫిబ్రవరి 23న 'ఇండియన్ మ్యాజిక్' అవార్డ్ష నైట్
- పీసీ సర్కార్ జూనియర్ సహా, 10 మందికి 'ఐఎంఏ' పురస్కారాల ప్రదానం

విశాలాంధ్ర - విశాఖపట్నం: ఇండియన్ మ్యాజిక్ అకాడెమీ దశమ వార్షికోత్సవ సందర్భంగా అంతర్జాతీయ ఇంద్రజాలికుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఫిబ్రవరి 23వ తేదీన కళాభారతి ఆడిటోరియంలో ఇండియన్ మ్యాజిక్ అవార్డ్స్ నైట్ నిర్వహించనున్నట్టు ప్రముఖ ఇంద్రజాలికులు డాక్టర్ బి.ఎస్ రెడ్డి చెప్పారు. ఐఎంఏ అవార్డ్స్ నైట్ గోడపత్రికను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖామంత్రి కందుల దుర్గేష్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. తమ సంస్థ దశమ వార్షికోత్సవ సందర్భంగా జాతీయ అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతిగడించిన దేశ, విదేశీ మహేంద్రజాలికులకు అవార్డుల ప్రదానం చేయనున్నట్టు బీఎస్ రెడ్డి మంత్రికి వివరించారు. ప్రపంచ ప్రఖ్యాత భారతీయ మహేంద్రజాలికుడు పీసీ సర్కార్ జయంతి అంతర్జాతీయ ఇంద్రజాలికుల దినోత్సవం(ఇంటర్నేషనల్ మెజీషియన్స్ డే) గా గుర్తింపు తెచ్చుకుంది. ఈ ఏడాది ఉత్సవానికి పీసీ సర్కార్ తనయుడు జూనియర్ పీసీ సర్కార్‌కు జీవన సాఫల్య పురస్కారం, మరో 10 మంది దేశ, విదేశీ మెజీషియన్లకు ఐఎంఏ అవార్డుల ప్రదానం జరుగుతుందని తెలిపారు. దేశం నలు చెరగుల నుంచి, ప్రపంచం నలుమూలలనుంచి ఏర్చికూర్చిన ఇంద్రజాల నిపుణుల అబ్బురపరిచే అబ్రకదబ్రా ప్రదర్శనల నడుమ ఈ అవార్డుల దినోత్సవం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో బీఎస్ రెడ్డితోపాటు ఐఎంఏ కార్యవర్గం, ఉత్సవ నిర్వహణా కమిటీ సభ్యులు, మెజీషియన్లు విజయ్ కుమార్, ఎంఏ రెడ్డి, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీలకు ఉపాధినిచ్చే
టూరిజాన్ని అభివృద్ధి చేయాలి
పీసీసీ ప్రధాన కార్యదర్శి మూల వెంకటరావు

విశాలాంధ్ర - పెందుర్తి : ఆదివాసీలకు ఉపాధి కల్పించే టూరిజాన్ని అభివృద్ధి చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ, ఓటీసీ డిపార్ట్మెంట్ ఇంచార్జ్ మూల వెంకటరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పర్యాటక రంగం అభివృద్ధి పేరుతో 1/70 చట్టానికి సవరణలు చేస్తే గిరిజనుల మనుగడకు ముప్పు ఏర్పడుతుందని ఆవేదన వెలిబుచ్చారు. చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయవలసిన వారే తూట్లు పొడవడం, అందునా ఉత్తరాంధ్రలో మచ్చలేని వ్యక్తిత్వం గల స్పీకర్ లాంటి వ్యక్తి తప్పుగా మాట్లాడటం సమంజసం కాదని పేర్కొన్నారు. దేశ, విదేశీ పర్యాటకులను ఆకర్షించడానికి టూరిజం శాఖ చలి ఉత్సవాలు నిర్వహిస్తుందని, ఆదివాసీలకు ఇలాంటి వాటితో ప్రయోజనం లేదని తెలిపారు. ఏజెన్సీలో స్పెషల్ డిఎస్సీ నోటిఫికేషన్ విడుదల, టూరిజం శాఖకు వచ్చే ఆదాయంలో 25 శాతం నిధులు స్థానిక ఆదివాసీల అభివృద్ధికి ఖర్చు చేయడం, ఏజెన్సీ ప్రాంతంలో రోడ్లు, వంతెనలు ఏర్పాటు వంటి అభివృద్ధి కార్యక్రమాలతో ఆదివాసీల జీవితాలు బాగుపడతాయని పేర్కొన్నారు. అనేక గిరిజన ప్రాంతాలలో గర్భిణీలు, రోగులను హాస్పిటల్ కు తరలించేందుకు అంబులెన్సులు రాలేకపోవడంతో, డోలి మోతల కారణంగా మార్గమధ్యంలో అనేకమంది ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయని ఆవేదన వెలిబుచ్చారు. సరైన పౌష్టికాహారం లేక రక్తహీనత, సికిల్ సెల్ ఏనీమియా, టైఫాయిడ్, మలేరియా, వంటి వ్యాధులతో బాధపడుతున్న వారికోసం సరైన వైద్యసదుపాయాలు కల్పించి టురిజాన్ని అభివృద్ధి చేసుకోవచ్చునని వివరించారు. ఆదివాసీల కళలు, సంస్కృతిని కాపాడుతూ ఉత్సవాల నిర్వహణ పట్ల ప్రభుత్వం పూర్తి దృష్టి సారించాలన్నారు. టూరిజం అభివృద్ధి కోసం పెట్టుబడుదారులను ప్రోత్సహించడం కంటే ప్రభుత్వమే నేరుగా గిరిజన భాగస్వామ్యంతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం ద్వారా గిరిజన సంపదను కాపాడుకోవచ్చునని వివరించారు. ఈ విషయాలపై స్పీకర్, ఉప ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించాలని పత్రికా ముఖంగా కోరుతున్నట్లు పీసీసీ ప్రధాన కార్యదర్శి మూల వెంకటరావు వెల్లడించారు.

ఉత్తమసేవ పురస్కార గ్రహీతలకు అభినందనల వెల్లువ

విశాలాంధ్ర - ఆనందపురం: గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా విశాఖ జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమసేవ పురస్కారాలు అందుకున్నా ఆనందపురంమండల తహిసీల్దార్ పి.శ్యామ్ ప్రసాద్,ఎంపిడిఓ పి.జానకి గ అవార్డుల వచ్చిన సందర్భంగా ఆనందపురం మండల ఆరోగ్య కేంద్రం డాక్టర్.గంగునాయుడు కి మండలంలో ఉత్తమ సేవలు అందించినందుకు బిజేపి విశాఖ జిల్లా కిసాన్ మోర్చ అధ్యక్షులు పి.వి.వి.ప్రసాదరావు పట్నాయక్ బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ఉప్పాడ అప్పారావు, బీజేపీ మండల అధ్యక్షురాలు పిల్లా విజయ,మాజీ మండల అధ్యక్షులు మీసాల రాము నాయుడు, మండల అధికారులకు శాలువా తో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఆనందపురం మండలంలో భవిష్యత్తు లో మరిన్ని సేవలు చేసి ఉన్నత అవార్డులు పొందాలి అని కొనియాడారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు:- బిజేపి నాయకులు కె.వి.ఎన్.కృష్ణారావు (గోపీ) పోతిన జీవన్ సంతోష్,మాదబత్తుల బుజ్జి, పిల్లా సూర్యనారాయణ,బంక సీత%శీ%నాయుడు,డి.సుధాకర్ వర్మ డాక్టర్. ఎస్.కే.షానాజ్,గుడిలోవ నీటి సంఘం డైరెక్టర్ కొలుసు శ్రీను,మల్లారావు కృష్ణ ,ఉప్పాడ శివ, బిజేపి కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంబైబ్ ఏఐ పవర్డ్ లెర్నింగ్ ప్లాట్‌ఫామ్‌ను
ఇంటిగ్రేట్ చేసిన సామ్‌సంగ్

విశాలాంధ్ర- విశాఖపట్నం: భారతదేశ అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ అయిన సామ్‌సంగ్ ఏఐ ఆధారిత వ్యక్తిగతీకరించిన అభ్యాస ఫలితాల వేదిక అయిన ఎంబైబ్ తో భాగస్వామ్యం కుదుర్చు కుంది, దీనిని టీవీ కోసం రూపొందించిన విద్యా యాప్ అయిన సామ్‌సంగ్ ఎడ్యుకేషన్ హబ్ యాప్‌లో అనుసంధానించింది.

ఈ భాగస్వామ్యం టీవీలు విద్యార్థులకు వ్యక్తిగతీకరించిన అభ్యాస అనుభవాలను అందించే ప్రభావవంతమైన విద్యా సాధనాలుగా మారడానికి సహాయపడుతుంది. ఈ భాగస్వామ్యం ద్వారా సామ్‌సంగ్ ఎడ్యుకేషన్ హబ్ యాప్‌లో భాగంగా సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, ఐబీ, కేంబ్రిడ్జ్, అన్ని రాష్ట్ర బోర్డులు, ఐఐటీ జేఈఈ, నీట్ వంటి ప్రధాన ప్రవేశ పరీక్షలతో సహా అన్ని ప్రధాన పాఠ్యాంశాలకు మద్దతు ఇస్తూ విస్తృతమైన విద్యా కవరేజీని ఎంబైబ్ అందిస్తుంది.

ఆరోగ్యకరమైన జుట్టు, చర్మం కోసం
సింఫనీ హెయిర్ ఫాల్ కంట్రోల్ గీజర్లు

విశాలాంధ్ర- విశాఖపట్నం: సింఫనీ లిమిటెడ్ వాటర్ హీటింగ్ సొల్యూషన్స్ లోకి ప్రవేశించింది. జుట్టు రాలడానికి కారణాలలో ఒకటైన కఠినమైన నీటిని మృదువైన నీరుగా మార్చే, హానికరమైన రసాయనాలు మరియు అవక్షేపాలను ఫిల్టర్ చేసే 9-లేయర్ ప్యూరోపాడ్ టెక్నాలజీతో కంపెనీ వాటర్ హీటర్ల శ్రేణిని విడుదల చేసింది. వాటర్ హీటర్ విభాగంలో సింఫనీ స్పా, సింఫనీ సౌనా, సింఫనీ సోల్ అనే మూడు మోడళ్లను 10లీటర్, 15 లీటర్, 25లీటర్ల సామర్థ్యంలో విడుదల చేసింది.

ఫైవ్ స్టార్ రేటెడ్ వాటర్ హీటర్ శ్రేణిలో హెవీ-డ్యూటీ హీటింగ్ ఎలిమెంట్, మెరుగైన మన్నిక కోసం టైటానియం ప్రో కోటింగ్, ఎక్కువ ఆయుర్దాయం కోసం మెగ్నీషియం రాడ్ మరియు సమగ్ర భద్రతా ఫీచర్లు ఉన్నాయి. అదనంగా, కంపెనీ తన సింఫనీ స్పా శ్రేణిలో స్మార్ట్ బాత్ టెక్నాలజీని ప్రవేశపెట్టింది